# సెన్స్ ఆఫ్ సాటిస్‌ఫ్యాక్షన్

సేతురామన్ మద్రాసు స్వదేశి. ప్రస్తుతం హైదరాబాదులో ఒక ప్రైవేటు కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పై రెండు చిరునామాలకు అతీతంగా అతడు, ఈ కథలో ప్రధాన పాత్రధారి కూడా!

చరిత్ర, అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రాలలో బి.ఏ. డిగ్రీ కష్టపడి సంపాదించిన తరవాత, ఛీ! ఛీ! అసలు బి.కామ్ చదివి వుంటే ఎంత బాగుండేది! అని, పశ్చాత్తాప పడే కుర్రవాడు అతడు. కాని, దానివల్ల పెద్ద ప్రమాదమేమీ జరుగలేదు. ఆయన పితృశ్రీ వెంకటేశ్వరన్ గారి కఠిన ప్రయత్నాల ఫలితముగా మద్రాసు నుంచి కొంచెం దూరం అయినా గూడా కుంభకోణంలో వున్న ఒక కాలేజీలో ఆ అబ్బాయికి ఎమ్.బి.ఎకు ప్రవేశం దొరికింది. తదుపరి, ఆ శుద్ధ విద్యార్థి మంచి మార్కులతో పరీక్షలు పాస్ అయ్యాడు కూడా. వెంటనే మద్రాసులో ఒక కంపెనీలో అతనికి ఉద్యోగం దొరికింది. ఈ మహాకార్యం వెంకటేశ్వరన్ ప్రయత్న ఫలితమే. దాని తర్వాత ఇంకా తన జీవితంలో ఎలాంటి అభివృద్ధి కావాలన్నా, అది స్వయం కృషితోనే సంపాదించాలనే ఒక దృఢ సంకల్పం సేతురామన్ తీసుకున్నాడు. దాని ప్రకారంగా, తన పని చాలా చక్కగా, నిష్ఠాపూర్వకంగా చేయడమూ, దానికంటే ఇంకా మంచిగా తన పై అధికారులను కాకా పట్టడం అనేవి సేతురామన్ దైనందిన చర్యలలో ముఖ్యమైన రెండు భాగాలుగా తయారయ్యాయి. రెండు సంవత్సరాలలో ఆ యువకుడికి ప్రమోషన్‌తో హైదరాబాదు బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయింది.

హైదరాబాద్‌లో చేరి రెండు సంవత్సరాలు కాలేదు. అప్పటికే అతన్ని ''ఆంబిషన్'' అనే నల్లి కుట్టడం మొదలు పెట్టింది. ఎలాగయినా జీవితంలో శీఘ్రంగా, ఉన్నత స్థానాన్ని సంపాదించుకోవాలి అనే ఆలోచన మూలంగా, అతనికి రాత్రులలో సరిగా నిద్రపట్టేది కాదు. పట్టుకొని పైకి వెళ్లడానికి ఏదైనా తీగ దొరుకుతుందా అని అతను రోజూ దినపత్రికలలో వెతికేవాడు. ప్రస్తుతమున్న హోదా నుంచి, పై హవాను పొందడానికి ఎన్నో కంపెనీలకు ఆయన దరఖాస్తులను పంపించాడు. పై హోదా అంటే అతనికి ముఖ్యంగా కావాల్సినది పై స్థానం కాదు, ఎక్కువ ధనమే. ఇప్పుడు అతనికి రూ.3,500/- జీతం వస్తుంది. అందులో తన ఖర్చులకు అతను రూ.1,500/- కంటే ఎక్కువ ఉపయోగించడం లేదు. మిగిలినదంతా బ్యాంకుకు వెళుతుంది. ఒక పెద్ద మొత్తం ఇప్పటికే బ్యాంకులో ''బాలెన్స్‌గా వుంది. అనవసరంగా అతను ఒక్క పైస కూడా ఖర్చు పెట్టడు. అవసరానికి కూడా ఖర్చు పెట్టడు. అత్యవసరాలకు మాత్రం అంటే, ఖర్చు పెట్టడం తప్పదు అనే పరిస్థితులలో మాత్రమే అతని జేబు నుంచి డబ్బు వస్తుంది. ధూమపానం, ధూమ్రపానం, అతని జీవితంలో ఎప్పుడూ

లేని అలవాట్లు. సంక్షిప్తంగా చెప్పాలంటే అతను ఒక కల్తీ లేని పిసినారి. అతనికి వివాహం చేయాలని తండ్రి రెండు, మూడుసార్లు ప్రస్తావించినప్పుడు, ''ఇప్పుడు అక్కరలేదు, నాకింకో మంచి ఉద్యోగం దొరికిన తరువాత చూద్దాము'' అని చెప్పి అతను ఆ కార్యక్రమాన్నే నిరవధికంగా వాయిదా వేయడం జరిగింది. మంచి ఉద్యోగముంటే, మంచి అమ్మాయి దొరుకుతుందని అని మాత్రం కాదు, మంచి స్త్రీధనం గూడా లభిస్తుంది అని అతని మనసులో వుండే ఆలోచన.

ఢిల్లీలోని ఒక పెద్ద కంపెనీలో పెద్ద ఉద్యోగానికి అతనికి ఇంటర్వ్యూ వచ్చింది. ఢిల్లీలో అవివాహితుడుగా కాలం గడుపుతున్న ఒక బంధువును, అతను ఆఫీసు టెలిఫోను ద్వారా సంప్రదించాడు. దానికి ఖర్చు లేదు కదా! ఫలానా రోజు తాను ఫలానా రైలుకు వస్తున్నానని, రైల్వే స్టేషన్‌కు వచ్చి తనను తీసుకుపోవాలని అతను కోరాడు. ఆ బంధువు దానికి అంగీకరించాడు. ఒక వేళ అతను సమయానికి స్టేషన్‌కు చేరకపోతే అని భయపడి, అతని సరియైన చిరునామాను, రైలు స్టేషనుంచి అక్కడకు వెళ్లవలసినదారి, వివరాలు కూడా ఫోనులోనే అతన్ని అడిగి తెలుసుకున్నాడు.

ఒక శనివారం ఉదయం అతను ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాడు. ఒక ముఖ్యమైన పనికి శనివారం ప్రయాణం మొదలు పెట్టకూడదని అతనికి ఒక గట్టి అభిప్రాయం వున్నా గూడా, ఆదివారానికి దాన్ని వాయిదా వేస్తే, సోమవారం ఉదయం గం. 10 లకు జరగాల్సిన ఇంటర్వ్యూకు ఆలస్యం కావచ్చునీ అనుమానం వుండడం మూలాన, తన అభిప్రాయాన్ని తానే తాత్కాలికముగా కొట్టివేశాడు. తెల్లవారు ఝామున అతను ఇంటినుంచి బయటకు వస్తున్నప్పుడు అతనికి ఎదురుగా వచ్చిన శకునం ఒక భిక్షగాడిలాంటి మనిషి. కొంచెం చీకటిగా వుండటం వల్ల, అతను కనీసం ముఖక్షాళనం చేసి వచ్చాడా అని సేతురామన్‌కు కనుక్కోవడం సాధ్యం కాలేదు. ఏమైనా గాని, ఆ శకునం తనకంత మంచిదికాదని అనిపించింది. ఆ అపరిచితుడినే మనసులో చెడ తిట్టాడు కూడా. తరువాత అతను స్వయంగా, సమాశ్వాసం పొందాడు. ఎలాగండీ, అంత ప్రొద్దున్నే, పూర్ణకుంభంతో ఏ తరుణీమని రాగలదు? లేకపోతే ఆ బ్రహ్మ ముహూర్తంలో ద్విద్విజులు (ఇద్దరు బ్రాహ్మణులు) తమ సుఖ శయనాన్ని త్యజించి వీధిలోకి రాకూడదా? ఏమైన గూడ, చేతిలో ఒక గొడ్డలి పట్టుకొని ఏదైనా వెధవ తనకు శకునభంగం కలిగించ లేదు కదా! దానికే దేవుడికి స్తుతి చేయాలని అతను అనుకున్నాడు. గడచిన రాత్రిలో తయారుచేసి, పొట్లం కట్టుకున్న మూడు నూనె వేయకుండా చేసిన చపాతీలను, ఆలుగడ్డకూర తిని కొంచెం మంచినీళ్లు కూడా త్రాగేటప్పుడు ఆ రైలు లోపల చేసిన ప్రథమ భక్షణం, అంటే ప్రభాత భక్షణం చాలా గొప్పదని అతనికి అనిపించింది. ఎలాగైనా కాదుకదా! సీసాలు దొరికే శీతల పానీయాలు త్రాగితే క్యాన్సర్ రావడానికి అవకాశముందట.

మధ్యాహ్నం భోజనం చేయకుండా వుండడం సాధ్యం కాదు. ఫరవాలేదు. అది ఒక ''బేర్ మినిమమ్ ఎక్స్పెండేచర్''.

ఉదయం ఎదురు పడిన ఆ దుశ్శకున పక్షి గురించి చాలాసార్లు అతను ఆలోచించాడు. ఏమైనా గూడా సాంయంత్రం ఐదు గంటల వఱకు ఎలాంటి అడ్డంకులు ఎదురు కాలేదు. భోపాల్ చేరిందా? ట్రైన్ ఆగి చాలా సమయమయిందే. చాలమంది రైలు నుంచి దిగుతున్నారు, ఎక్కుతున్నారు; కొంతమంది బయటే ''ఈవినింగ్ వాక్'' కూడా చేస్తున్నారు. సేతురామన్ ఎవరితోనో ఏదేదో ప్రశ్నలు వేశాడు. భోపాల్ చేరేది రాత్రి గం. 9, గం. 10దో అని, ఇప్పుడు రైలు ఆగడం ముందెక్కడో ఏదో గూడ్సుబండి పట్టాలు తప్పడంవల్ల అయిందని ఎవరినో అడిగి తెలుసుకున్నాడు సేతురామన్. ఆ రోజు తెల్లవారుఝామున చూసిన దుశ్శకున భిక్షుగాణ్ణి చంపెయ్యాలని అనిపించింది. ఆ సమయంలో, ఆదివారం బయలుదేరకుండా, శనివారమే బయలుదేరిన తన మంచి బుద్ధికి అతనికి గర్వం కూడా కలిగింది. ఎంత ఆలస్యమయినా గూడా, ఆదివారమే తను ఢిల్లీకి చేరతాడు. ఇంటరవ్యూకు కనీసం ఏడు, ఎనిమిది గంటలు ముందుగానే ఢిల్లీకి చేరవచ్చు. ఆ గడువు పన్నెండు గంటలుకు తగ్గినా పరవాలేదు.

రాత్రి భోజనం గూడా అయిపోయింది. కాని బండి కదలలేదు. దాదాపు పది గంటలు అతను తన ''అప్పర్ బర్త్ మీద'' ఎక్కి పడుకున్నాడు. ముక్కోటి దేవతలకు మొక్కుకొని అతను సుఖ నిద్రలోకి జారుకున్నాడు.

ప్రొద్దున లేచి గడియారం చూస్తే, ఐదు గంటలయింది. మిగతా వాళ్లంతా మంచి నిద్రలో వున్నారు. బండి కదిలినట్టు లక్షణాలేవీ లేవు. తక్కున లేచి బాత్రూమ్కు వెళ్లి ప్రభాత కృత్యాలు మంచిగా చేసుకున్నాడు. అతనికి బాగా తెలుసు. ఇంకా కొంచెం సేపు తర్వాత రైలులో నీళ్లే వుండవని.

ఉదయం 'బ్రేక్ ఫాస్ట్''గా బ్రెడ్డు ముక్కలు మాత్రమే దొరికాయి. వేరే వాళ్లు గ్రుడ్లు కూడా తింటున్నారు. సేతురామన్ పూర్తి శాకాహారి కావడంవల్ల, ఆ గ్రుడ్లుపై పెట్టాల్సిన ఖర్చులోపల ఒక బ్రూ కాఫీ తాగ గలిగాడు. దాదాపు అందరూ ప్రయాణీకులు రైల్వే అధికారులు గుఱించి, రైల్వే మంత్రి గుఱించి, భారత ప్రభుత్వం గుఱించి, భారతదేశం గురించి తిట్లు తిట్టుకుంటూ సమయం గడుపుతున్నారు. నిమిషాలు గడిచిపోవడంతో సేతురామన్కు గుండె ఒత్తిడి ఎక్కువై పోయింది. ఇహ, ఎప్పుడు ఈ బండి బయలుదేరుతుంది? ఎప్పుడు ఢిల్లీ చేరుతుంది? కనీసం మధ్యాహ్నానికైనా బయలుదేరకపోతే రాత్రికి కూడా ఇది ఢిల్లీ చేరదు. వేకువ జామున చూసిన దరిద్రపు వెధవనే మరీ మరీ గుర్తుకు తెచ్చుకొని శాపనార్థాలు పెట్టాడు.

కాని మరీ ఆలస్యం కాకుండా, ఉదయం తొమ్మిదిన్నరకే బండి కదిలింది. రైలు వేగం అంత మంచిగా లేదని సేతురామన్‌కి అనిపించింది. ఇంకొకసారి, రైలు ఆగిపోగూడదని మరీ మరీ ప్రార్థించాడు.

చివరకు రైలు ఢిల్లీకి చేరేటప్పటికి రాత్రి పదకొండున్నర దాటింది. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఒక ఆటోరిక్షా పట్టుకొని తనకు బంధువూ, మిత్రుడూ అయిన వెంకట్రామన్ ఇంటికి బయలుదేరాడు. సేతురామన్ ఢిల్లీకి రావడం అదే మొదటిసారి. అందుకే ఆటో రిక్షావాడు సరయిన దారిలో తీసుకు వెళుతున్నాడో లేక అనవసరంగా తిప్పుతున్నాడో అన్న అనుమానం వచ్చింది. హిందీ భాష ఒక మాదిరిగా అతనికి తెలిసినందువల్ల, దారిలో డ్రైవరుతో అతనూ మాట్లా డుతూ కూర్చున్నాడు. ఆ విధంగా అతనితో దోస్తీ ఏర్పడడం ఉత్తమంగా వుంటుం దని, ఆ అర్ధరాత్రివేళ అతనికి తోచడంతో అసమంజసం ఏమీ లేదు కదా! ఆ ఆటోరిక్షావాడు మంచివాడని అనిపించటంవల్ల అతని భయం కొద్దిగ తగ్గింది. పన్నెండున్నర గంటలకు వాళ్లు వెంకట్రామన్ ఇంటికి చేరారు. ఆ ఆటోరిక్షావాడి నైపుణ్యం వల్లనే, బ్రహ్మ ముహూర్తానికి ఇంకా ఎక్కువ సమయం లేని ఈ రాక్షస ముహూర్తంలో, ఆ ఇంటికి చేరుకోవడం సాధ్యమైంది. కాని దానివల్ల లాభమేమిటి? ''నవతాల్'' అనబడే, సెంట్రల్ జైలు గేటుకు గూడా సరిపోయే, ఒక పెద్ద తాళం, ఆ ఇంటి తలుపు సింహద్వారాలకు వ్రేలాడుతుంది. పక్కింటి వాళ్లతో ఎవరినైనా గాని లేపుదామంటే, ఆ అసమయంలో ఏదైనా ఒక అకాల మరణం గురించి ''టెలిగ్రాం'' తీసుకొనివచ్చే ఖాకీ బట్టల వాడికి మాత్రమే ధైర్యం ఉంటుంది.

''అరే భాయ్, ఇక్కడ దగ్గరగా చాలా చౌకగా ఏదైనా ''సౌత్ ఇండియన్ లాడ్జ్'' దొరుకుతుందా అని ఆ రిక్షావాడితో అతి వినయంతో అతను అడిగాడు.

''ఈ సమయంలో ఏ లాడ్జిలో ప్రవేశం దొరుకుతుంది సార్, తమరికి చౌక స్థలం కావాలి. ఉదయమే ఇంటర్వ్యూకు కూడా పోవాలి. ఇంక మిగిలింది రెండు, మూడు గంటలే! ఫ్రీగా ఒక చోటులో గడిపితే సరిపోతుంది గదా! కొద్దిగా ఇబ్బంది అయినా వుండవచ్చు.''

ఆటోరిక్షాలోకి మెల్లగా ఎక్కబోయిన సేతురామన్ ఒక సెకండులో, లోపలికి దూకేశాడు. ''ఏం ఫరవాలేదు భాయ్, రెండు గంటల సేపు తలను ఎక్కడ దాచినా పరవాలేదు. అది ఎక్కడయినా ఒకటే''.

ఆ రిక్షావాడు మనసులో, ఈ క్రొత్త పాసింజర్ గురించి, ఎలాంటి అభిప్రాయాలు పుట్టుకొస్తున్నాయో అన్న ఆలోచన సేతురామన్ మనసులోకి రానేలేదు. వెంకట్రా మన్ తెలిసో, తెలియకో తనకు చెయ్యిచ్చినందుకు ఎంతో దుఃఖంతో జీడి మామిడి పొగొట్టుకున్న ఉడుత మాదిరే కూర్చున్న సమయంలో వచ్చింది - ఈ దేవదూతగారి

ఉచిత ఆహ్వానం. అతను మనసులో శతకోటి దేవతలకు కృతజ్ఞతలు తెలియజేశాడు. ఫట్ ఫట్ అని ఒక పది పన్నెండు కిలోమీటర్ల దూరం పోయింతర్వాత చివరకు ఆ ఆటోరిక్షా ఒక అభయస్థానానికి చేరింది. అక్కడ కొన్ని ఆటోరిక్షాలు వున్నాయి. వాటిలో, అన్నింటిలోపల వాటి సారథులు యోగాభ్యాసంలో మామూలుగా అభ్యసించ లేని విన్యాస రీతిలో పడుకొని నిద్రపోతున్నారు. ఆ విన్యాసాన్ని దాదాపు మయూరాసనానికి విపరీతాసనమని కావాలంటే విశ్లేషించవచ్చు. ఆటో డ్రైవర్ల ఆఫీసు అనబడే ఒక షెడ్డుకి బయటే ఐదో, ఆరో నులకమంచాల్లో పంచ నక్షత్ర స్వప్నాలతో కొంతమంది సుఖ సుషుప్తిలో నిమగ్నమై వున్నారు.

ఆటోరిక్షా మిత్రుడు వారిలో ఒకరిని లేపి, ఏదో చెప్పాడు. అతడు తనలో తను గొణుగుతూ తన ఆటోరిక్షావైపు వెళ్ళిపోయాడు. అతను తన తలగుడ్డ తీసి మంచాన్ని బాగా దులిపి ''సార్, తమరు ఇక్కడ పడుకోండి. పొద్దున్నే ఆ పైపుక్రింద కావాలంటే స్నానం చేయవచ్చు. దానివెనక స్నానం చేయడానకి బాత్ రూమ్ సౌకర్యాలు లేవు. ఎలాగైనా తమరు తెల్లవారే వరకు నిద్రపోండి, నేనిక్కడే వుంటాను. వేరే, ఎవరు పిలిచినా నేను వెళ్లను. తమరు నిర్భయంగా వుండండి'' అని ధైర్యం చెప్పి తన ఆటోరిక్షా దగ్గరకు వెళ్లాడు.

ఆ నులక మంచంక్రింద, తన సూట్‌కేసు భద్రంగా పెట్టి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామన్న ఉద్దేశ్యంతో అతను పడుకున్నాడు. కాని, దగ్గరగా కొందరు మంచాల్లో సుఖశయనం చేస్తున్న ఆటోరిక్షా వాళ్లు వివిధ రాగాలతో, తాళాలతో వున్న గురకల వల్ల అతనికి నిద్ర పట్టనే లేదు. అయినాగూడా దీర్ఘమైన రైలు ప్రయాణం, ఢిల్లీలో ఆ అర్థరాత్రప్పుడు ఒకటిన్నర గంట తిరగడం లాంటి సమ్మిశ్ర అలసట ఫలితంగా నిద్రాదేవి పరిరంభంలోకి జారిపోవడానికి అతని అర్థగంట కంటే ఎక్కువ పట్టలేదు.

ఏదో శబ్దం విని అతను ఉలిక్కిపడి లేచాడు. చేతి గడియారంలో చూసేవరకు సమయం ఐదుగంటలకు పావు తక్కువ. వెంటనే లేచాడు. ఇద్దరు ఆటోరిక్షావాళ్లు అప్పటికే ముఖక్షాళనం చేస్తున్నారు. మిగతా వాళ్లంతా దున్నపోతుల్లా నిద్రపోతున్నారు.

పెట్టె తెరచి, లుంగీ, టవల్, షేవింగ్ బాక్స్ బయటకు తీసి, తన కార్యక్రమాలు మొదలు పెట్టాడు. ముందే లేచిన, ఆ ఇద్దరు డ్రైవర్లు సేతురామన్‌ని చూడగానే ''సలామ్ సాబ్'' అని అభివాదనము చేయడం చూసి అతనికి ఆశ్చర్యం వేసింది - ఢిల్లీలో ఆటోరిక్షావాళ్లు ఎంత మర్యాదస్తులు.

''షెడ్డు బయట గోడలో ఎలక్ట్రిక్ లైటు దగ్గర ఒక చిన్న అద్దం వేలాడుతుండడం వల్ల ఎంతో సౌకర్యంగా ఉంది అనిపించింది. కుళాయి దగ్గర ముఖం తడుపుతూ,

సబ్బు నురగ పట్టించి, అద్దం దగ్గరకెళ్ళి, అందంగా క్షవరం చేసుకున్నాడు. తరువాత తలకు కొంచెం నూనె రాసి, కుళాయి దగ్గరకు వెళ్లేటప్పుడు అక్కడ స్నానం చేస్తున్న ఒక డ్రైవరు చాలా తొందరలో అది ముగించుకొని, స్థలం వదిలాడు. సేతురామన్ తన కాకి స్నానాన్ని తొందరగా ముగించుకున్నాడు. స్నానం మధ్యలో గూడా అతను తన పెట్టెను, పరిసరాలను ఒక కంట కనిపెడుతూనే వున్నాడు. తను అలాగే స్నానం చేస్తున్నపుడు తనకు తెలిసినవారెవరైనా, ఆ దృశ్యం చూస్తే, తన స్వదేశంలో ఆ వదంతి దావానలం మాదిరి వ్యాపిస్తుందేమోనని భయంవల్ల ఆ ప్రభాత శీతలజల ప్రభావం ఆనందాన్ని అతను తెలుసుకోలేపోయాడు. స్నానం చేసింతర్వాత, మంచి బట్టలు వేసుకొని, తల బాగా దువ్వుకొని, ముఖానికి పౌడరు వేసుకొని సామానంతా సూట్‌కేసులో సర్దుకొని తయారయ్యేటప్పటికి ఆయనకు కురుక్షేత్రయుద్ధాన్ని జయించినంత సంతోషం కలిగింది. ఇంక ఏం పర్వాలేదు. సమయం ఇప్పుడు ఐదున్నరే అయింది. తొమ్మిదిన్నరకు కదా ఇంటర్వ్యూ. దానికి, ఎనిమిది గంటలకు బయలుదేరినా చాలు.

తనకు ఆ ఆటోరిక్షా స్టాండులో ఎలాంటి సంబంధం లేనట్లు, అతను రోడ్డు ప్రక్కన అటూ ఇటూ ''మార్నింగ్ వాక్'' మొదలు పెట్టాడు. ఆరున్నరు గంటలప్పుడు, ఆపద్బాంధవుడైన ఆ రిక్షా డ్రైవరు, తయారై దగ్గరకు వచ్చి ''ఏం సార్, బయలుదేర దామా. తమరి ఇంటర్వ్యూ స్థలం దగ్గర, తమరిని వదిలేసి నేను నా పనికి వెళ్లిపోతాను. దార్లో టిఫెన్ గూడా చేసుకుందాం'' అని చాలా గౌరవంగా హిందీలో చెప్పాడు. చిరునవ్వును ముఖంమీద పులుముకొని సేతురామన్ ఒప్పుకున్నాడు.

దారిలో ఉన్న ఒక సౌత్ ఇండియన్ హోటల్లో టిఫిన్ చేసిన తరువాత ఇద్దరి బిల్లు సేతురామన్ కట్టాడు. ఇంటర్వ్యూ జరగాల్సిన కంపెనీ దగ్గర సేతురామన్‌ను వదిలేసి మితంగా డబ్బు వసూలు చేసుకొని ఎంతో మంచివాడైన ఆ ఆటోడ్రైవరు నిష్క్రమించాడు. సేతురామన్ తనకు తెలిసినంతవఱకు హిందీలో అతనికి కృతజ్ఞత తెలియజేశాడు. రెండు మూడు నిముషాల పాటు అతనితో హస్తచాలనం చేశాడు అనే విషయాలు ఇక్కడ ప్రస్తావ యోగ్యం. తనకు పరిచయం లేని చోట ఇలాంటి దేవదూతలు దొరకడం తన పంట. తన తల్లిదండ్రులకు దైవం పై వున్న అచంచల విశ్వాసమే అని నమ్ముతూ గణపతికి, కుమారస్వామికి, తిరుపతి వేంకటేశ్వరుడికి అతను తన అకైతవంగా కృతజ్ఞతతో కళ్లు మూసుకుని నాసా రంధ్రాల ద్వారా ప్రసారం చేశాడు.

ఇంటర్వ్యూ కార్యక్రమాలు సేతురామన్‌కు అంత తృప్తికరంగా జరగలేదు. ఆరోజు సాయంత్రం ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి బయలు దేరాడు. ఆ రైలు హైదరాబాదుకు చేరాల్సిన సమయానికి పది నిమషాలు ముందే చేరడం కూడా జరిగింది.

ఒక వారంలోపల ఆ ఇంటూర్వ్యూ గురించి వ్యతిరేకార్థక వార్త సేతురామన్‌కు అందింది. ఆ కంపెనీవాళ్లు తనకు పోవడానికి, రావడానికి ఫస్ట్‌క్లాసు ఛార్జీలిచ్చినా గూడా తను, రెండవ తరగతిలో అతి సుఖంగా పోయిరావడం వల్ల బాగానే చేతిలో మిగిలింది. దాన్ని గురించి, అతనికి చాలా సంతోషం కలిగింది. ఆ డబ్బుతో కావాలంటే ఇంకోసారి ఢిల్లీకి వెళ్లిరావచ్చు. మొత్తంగా నష్టమేమీ కాలేదు కదా? సంతోషం.

ఢిల్లీలో కలసిన దేవదూత సమానుడైన ఆ ఆటోరిక్షావాడి రూపం అతని మనసునుంచి పోవడానికి కొంత కాలం పట్టింది. హైదరాబాదులో పది, పదిహేను ఆటోరిక్షాల్లో ఎక్కి, ఘన నష్టాలు సంభవించిన తరవాత, ఆటో వాళ్ల గురించి ఆదేవ దూతడు కలిగించిన సదభిప్రాయానికి భంగం కలిగినందుకు ఆశ్చర్యపడనక్కరలేదని హైదరాబాదులో అందరికి తెలుసుకదా?

ఏమయినా గూడ, ఆ ఢిల్లీ ప్రయాణ సమయంలో ఒక్క రాత్రి కోసం, అనవసర మైన హోటల్ ఖర్చు చేయకుండా, అంత డబ్బు మిగుల్చుకున్నందుకు ఈ రోజుకు కూడా అతనికి మిగిలిన సంతృప్తిని వర్ణించాలంటే ''సెన్స్ ఆఫ్ సాటిస్ ఫాక్షన్'' అనే చెప్పాలి.

---